# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..

News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com

సంపుటి : 3 సంచిక : 314 గురువారం 2 ఏప్రిల్ 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



## తమిళనాడులో కుల, మత హింసలేవీ లేవు

- బీజేపీ రాష్ట్రాల్లోనే సమస్యలు: స్టాలిన్
- బీజేపీపై విమర్శలు గుప్పించిన స్టాలిన్
- బీజేపీ రాష్ట్రాల్లోలా తమిళనాడులో ఘర్షణలు, హింస వెల్లడి
- రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపణ

# వాటర్ వార్

- ఏపీ, తెలంగాణ మధ్య ఇది తెగని పంచాయితీ
- ఒడవని లొల్లి. ప్రతీ ఏడాది ఒకటి రెండుసార్లు అయినా.. నీళ్ల రగడ రచ్చ చేయడం కామన్
- రెండు రాష్ట్రాల బార్డర్‌లో ఉన్న శ్రీశైలం డ్యామ్ విషయంలో..ఏదో పేచీ ఉండనే ఉంటుంది
- ఏపీ సర్కార్ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయడంతో వాటర్ వార్ కాస్త చల్లబడింది
- శ్రీశైలం ప్రాజెక్టు వివాదాలకు కేరాఫ్‌గా ఎందుకు మారింది?



హైదరాబాద్/కర్నూలు

వాటర్ వార్. ఏపీ, తెలంగాణ మధ్య ఇది తెగని పంచాయితీ. ఒడవని లొల్లి. ప్రతీ ఏడాది ఒకటి రెండుసార్లు అయినా.. నీళ్ల రగడ రచ్చ చేయడం కామన్. పైగా శ్రీశైలం డ్యామ్ నీళ్ల వివాదం మాత్రం నెక్స్ట్ లెవల్. రెండు రాష్ట్రాల బార్డర్‌లో ఉన్న శ్రీశైలం డ్యామ్ విషయంలో..ఏదో పేచీ ఉండనే ఉంటుంది. అయితే మీడియా ప్రకటనలు, లేఖలు రాసి నిరసనలు తెలుపుతూ వచ్చిన తెలంగాణ లీడర్లు ఈసారి ఓ అడుగు ముందుకేశారు. ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు మీద ధర్నా చేసేందుకు రెడీ కాగా.. ఏపీ సర్కార్ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయడంతో వాటర్ వార్ కాస్త చల్లబడింది. శ్రీశైలం ప్రాజెక్టు వివాదాలకు కేరాఫ్‌గా ఎందుకు మారింది? ఇంత జరుగుతున్న ఐఖీఓః ఎందుకు సైలెంట్‌గా - మిగతా3లో



## ఏప్రిల్ 15 నుంచి రైతు భరోసా

- రైతు భరోసాపై ప్రభుత్వం భారీ గుడ్ న్యూస్..
- ఈ నెల 15 నుంచి అకౌంట్లోకి డబ్బులు..
- కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందినవారికి శుభవార్త అందించింది
- కొత్తగా పాసు పుస్తకాలు పొందినవారు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారు
- ఎప్పుడెప్పుడు వస్తుందా అని చూస్తున్నారు
- ఈ క్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్

తెలంగాణ రైతులకు రేవంత్ సర్కార్ భారీ శుభవార్త అందించింది. రైతు భరోసా పథకంపై కీలక ప్రకటన చేసింది. రేవంత్ ప్రభుత్వం ఇటీవల యాసంగి సీజన్‌కు సంబంధించిన తొలి విడత రైతు భరోసా నిధులను విడుదల చేసిన విషయం తెలిసిందే. తొలి విడతగా లబ్దిదారులందరి అకౌంట్లలో రూ.6 వేల చొప్పున తొలి ఎకరానికి జమ చేసింది. ఇక త్వరలో రెండో విడతలో మరికొన్ని ఎకరాలకు, ఏప్రిల్ చివరి నాటికి - మిగతా3లో



## కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ ఖాయం

- అసోంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు
- అసోం అసెంబ్లీ ఎన్నికల ఓటమితో రాహుల్ గాంధీ వంద అపజయాలను పూర్తి చేసుకుంటారని ఎద్దేవా

## విమాన ఇంధన ధరలు పాక్షికంగా పెంపు

- సామాన్య ప్రయాణికుల కోసమే: కేంద్రం
- కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త మీడియా సమావేశంలో పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి వెల్లడి



## 'ఎన్నికల ప్రచారంలో భద్రతా లోపాలు'

- అమిత్ షాకు లేఖ రాసిన దళపతి విజయ్?
- ఎన్నికల ప్రచారంలో భద్రతా లోపాలు జరిగాయంటూ టీవీకే అధినేత ఆరోపణ
- హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాసిన దళపతి





## ఇది బీజేపీ లూట్ దివస్

- నిత్యావసరాల ధరలు పెరుగుతుండడంపై కాంగ్రెస్ ఫైర్
- ప్రజలు ఊరట కోరుకుంటుంటే, లూటీ చేస్తున్నారు
- దేశాన్ని దోపిడీ చేయడంపైనే మోదీ సర్కారు ఫోకస్
- టీ, తినుబండారాల రేట్లు కూడా పెరిగిపోయాయి
- 900కుపైగా ఔషధాల ధరలు పెరగబోతున్నాయి : కాంగ్రెస్




## మీ సేవ కేంద్రాల్లో సర్వీసు ధరలు పెంపు

జీవో జారీ చేసిన ప్రభుత్వం

మీ సేవలో అన్ని సర్వీసులపై దాదాపు 50 శాతం ధరల పెంపు

ఆదాయ, కుల, స్థానికత వంటి సర్టిఫికెట్ల జారీకి రూ.80 రుసుం

జనన ధ్రువీకరణపత్రం ప్రింట్ ఇవ్వడానికి రూ.62 రుసుం

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మీసేవ కేంద్రాల్లో అన్ని సేవల ధరలను పెంచారు. ఆయా సర్వీసులపై ధరలను 50 శాతం మేర పెంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. ఆదాయ, కుల, స్థానికత వంటి సర్టిఫికెట్ల జారీకి రుసుంను రూ.80కి పెంచారు. జనన ధృవీకరణ పత్రం రుసుం రూ.62 చేశారు. కేటగిరీ 'ఏ' మరియు కేటగిరీ 'బి' కింద వచ్చే దాదాపు అన్ని సేవలపై కూడా ధరలను పెంచింది. ఇప్పటి వరకు 'ఏ' కేటగిరీ కింద కనీస ఛార్జీ రూ.35 ఉండగా, దానిని రూ.35కు పెంచారు. ఇందులో అడంగల్, పహాణీ వంటి తక్షణ సేవలు ఉంటాయి. కేటగిరీ 'బీ' సర్వీసుల ఛార్జీని రూ.80కి పెంచారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ప్రాసెస్ అయ్యే కుల, ఆదాయ ధృవీకరణ వంటి సేవల ధరలు రూ.80కి పెరిగాయి. - మిగతా3లో

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నాం
- ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలి
- ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించాం
- సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



హైదరాబాద్

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్‌ను - మిగతా3లో

## బంగాల్‌లో ఎస్ఐఆర్

47లక్షల అభ్యంతరాలు పరిష్కారం



- ఏప్రిల్ 7నాటికి మొత్తం పూర్తి చేయాలని సుప్రీం ఆదేశం
- బంగాల్ ఎస్ఐఆర్‌పై 60 లక్షల అభ్యంతరాలు
- ఇప్పటికే 47.4 లక్షల అభ్యంతారల పరిష్కారం
- ఈ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు

# కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ ఖాయం

అసోంలో బీజేపీ 'హ్యాట్రిక్' విజయాన్ని సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. రానున్న అసోం అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు (రాహుల్ గాంధీని ఉద్దేశించి) ఓటముల సెంచరీ పూర్తి చేసే సందర్భం అవుతాయని ఎద్దేవా చేశారు. అసోంలో గత పదేళ్ల బీజేపీ పాలనా కాలాన్ని సేవ, సుపరిపాలన యుగంగా అభివర్ణించారు. అసోంలోని గోగాముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

**రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తాం : మోదీ**

అసోంలో యూసీసీని అమలు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలను అను సరిస్తోందని ఆరోపించారు. సమాజంలో విభజనలు సృష్టించగల చట్టాన్ని గతంలో కూడా ఆ పార్టీ ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించిందని మండిపడ్డారు. ఆదివాసీ హక్కులను కాపాడతామని ఓటర్లకు మోదీ హామీ ఇచ్చారు. "2014కి ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం మత హింసపై ఒక బిల్లును తీసుకురావడానికి ప్రయత్నించింది. ఓ నిర్దిష్ట ఓటు బ్యాంకును సంతృప్తి పరచడమే ఈ బిల్లు లక్ష్యం. ఈ బిల్లు హింసకు పాల్పడిన వారిలో మెజారిటీ వర్గాన్ని దోషులుగా, మైనారిటీలను బాధితులుగా చిత్రీకరిస్తుంది. ఇది విభజనవాద బిల్లు. బీజేపీ దీనిని వ్యతిరేకించింది. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే సమాజంలోని మెజారిటీ వర్గం ఎంతటి వేధింపులను ఎదుర్కొని ఉండేదో ఊహించండి. ఇప్పుడు 12 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ అసోంలో అలాంటి బిల్లునే తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఎన్నికల్లో గెలవడానికే కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నారు. "



**కాంగ్రెస్ చీకటి పాలనను ప్రస్తుత యువత చూడలేదు : మోదీ**

గత పదేళ్లలో అసోం అభివృద్ధిలో సుదీర్ఘ ప్రయాణాన్ని సాగించిందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుత యువతరం బీజేపీ సుపరిపాలనను మాత్రమే చూశారే తప్ప, కాంగ్రెస్ పార్టీ చీకటి పాలనను చూడలేదన్నారు. గత దశాబ్ద కాలంలో అసోం అభివృద్ధిలో ఒక సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసిందన్నారు. గత పదేళ్ల కాలంలో అసోంకు చెందిన వేలాది మంది యువత తుపాకులను పక్కన పెట్టి భవిష్యత్తుపై దృష్టిసారించారని తెలిపారు. కాంగ్రెస్ తన పాలనలో మౌలిక సదుపాయాల లోపాలను సరిదిద్దడంలో విఫలమైందని ఆరోపించారు. "మొదట శర్బానంద సోనోవాల్ నాయకత్వంలో, ఆ తర్వాత హిమంత బిశ్వశర్మ మార్గదర్శకత్వంలో గత పదేళ్లుగా అసోం సేవ, సుపరిపాలన అనే కొత్త శకాన్ని చూసింది. త్వరలో రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు అభివృద్ధి చెందిన అసోంను నిర్మించే ఎన్నికలు. మరికొద్ది రోజుల్లో జరగబోయే అసోం శాసనసభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏకు హ్యాట్రిక్ విజయం ఖాయం. అలాగే కాంగ్రెస్‌కు ఓటముల హ్యాట్రిక్ కూడా ఖాయం. అంతేకాకుండా కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ కూడా ఖాయంగా కన్పిస్తోంది. అసోం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ఇదే నా మొదటి బహిరంగ సభ. ఇక్కడ కనిపిస్తున్న ఈ జనసముద్రమే మూడోసారి ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని చెప్పడానికి నిదర్శనం. ప్రజల ఆశీస్సులతో నేను వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రి పదవిని అధిరోహించాను. " బీజేపీ పాలనలో అసోం సాధించిన అభివృద్ధిని, కమలం పార్టీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించారు. ప్రజల నుంచి లభిస్తున్న విస్తృత మద్దతు, ఉత్సాహమే అసోం ఎన్నికల్లో వరుసగా మూడోసారి బీజేపీ సర్కార్ అధికారంలోకి రాబోతుందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా రాష్ట్రంలోని 15 లక్షలకు పైగా కుటుంబాలు లబ్ధి పొందుతాయని వెల్లడించారు. అలాగే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని చెప్పారు. లఖ్‌పతి దీదీ పథకం ద్వారా 40 లక్షల మహిళలకు ప్రయోజనం చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. అసోంలో ఉన్న 126 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకి, కాంగ్రెస్ పార్టీకి మధ్య ఈ ఎన్నికల్లో హోరాహోరీ పోరు జరగనుంది.

# ఇది 'బీజేపీ లూట్ దివస్'

దేశంలో ఈరోజు నుంచి చాలా నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ఇది బీజేపీ లూట్ దివస్ అని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత్ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు సర్వ నాశనం చేయబట్టే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఈ సంక్షోభ కాలంలో దేశంలోని సామాన్యులు ఊరట కోసం ఎదురు చూస్తుంటే, బీజేపీ సర్కారు మాత్రం ప్రజలను లూటీ చేయడంపై, దేశాన్ని దోపిడీ చేయడంపై పూర్తి ఫోకస్ పెట్టిందని ఆయన మండిపడ్డారు. ఈమేరకు బుధవారం రోజు ఖర్గే ఒక ట్వీట్ చేశారు. "దేశ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు నాశనం చేసిన పర్యవసానాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు భరిస్తున్నారు. ఈరోజు నుంచి పలు నిత్యావసరాలు, 900కుపైగా ఔషధాల ధరలు పెరగబో తున్నాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యయాలు చుక్కలను అంటుతున్నాయి. గుండె జబ్బులు ఉన్న రోగులకు అమర్చే కరోనరీ స్టంట్ల ధరలూ పెరిగాయి. వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలు రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. ఈ సిలిండర్ల సప్లై దారుణంగా తగ్గిపోయింది. దీంతో టీ రేటు, రోడ్డుపక్కన అమ్మే తినుబండారాల రేట్లు కూడా పెరిగిపోయా యి. ప్రత్యేకించి ప్రభుత్వ స్కూళ్లలో అమలుచేసే మధ్యాహ్న భోజన పథకంపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. విమాన ఇంధనం ధర మరింత ప్రియం అవుతోంది. ఒకప్పుడు సామాన్య పౌరులూ విమానాల్లో ప్రయాణించేవారు. ఇప్పుడు విమాన ప్రయాణం అనేది ఖరీదైన విషయంగా మారిపోయిం ది. సాక్షాత్తూ ప్రభుత్వమే విమాన టికెట్ల ధరలపై పరిమితిని



ఎత్తేసింది. బిట్యుమెన్ ధరలూ 50 శాతం పెరిగాయి. ప్రజలు ఇప్పుడు మరింత ఎక్కువ టోల్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి వస్తోంది. ఇది హైవేలపై దారుణమైన దోపిడీలా మారిపోయిం ది. స్పీడ్ పోస్ట్ ఛార్జీ సైతం 34 శాతం పెరిగింది. ప్లాస్టిక్ వస్తువులు, స్టీల్, సిరామిక్స్, రైతులు వినియోగించే పీవీసీ పైపుల ధరలూ పెరిగాయి. దేశ నిర్మాణ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది" అని ట్వీట్‌లో ఖర్గే ప్రస్తావించారు.

**లోక్‌సభ సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం : కాంగ్రెస్**

లోక్‌సభ సీట్ల సంఖ్యను 50 శాతం పెంచే బిల్లును బలవంతంగా ఆమోదింపజేయాలని మోదీ సర్కారు భావిస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. దీనివల్ల దక్షిణ, ఈశాన్య, పశ్చిమ భారత్‌లలోని చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒకవేళ ఆ ప్రతిపాదిత బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభిస్తే, ప్రతీ రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్లు 50 శాతం మేర పెరుగుతాయన్నారు. దీనిపై ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారని, ఆ బిల్లుపై అధికారిక ప్రకటన వెలువడ్డాక మరిన్ని రాష్ట్రాలూ వ్యతిరేకించే అవకాశం ఉంటుందని జైరాం రమేశ్ చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో సరిసమానంగా 50 శాతం చొప్పున లోక్‌సభ సీట్లను పెంచితే, దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. ఈవిషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్యనున్న గ్యాప్ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

**రాష్ట్ర అసెంబ్లీల సీట్లనూ 50 శాతం పెంచే ప్లాన్**

"ఉదాహరణకు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లు, తమిళనాడులో 39 సీట్లు ఉన్నాయి. కానీ ప్రతిపాదిత బిల్లు ప్రకారం యూపీలో సీట్ల సంఖ్య 120కి పెరుగుతుంది. ఇక ఇదే సమయంలో తమిళనాడులోని సీట్లు 59కే పరిమితం అవుతాయి. కేరళలో 20 నుంచి 30కి, బిహార్‌లో 40 నుంచి 60కి సీట్లు పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య 66కు, ఉత్తరాది రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య 200కు చేరుతుంది. దీనివల్ల తాత్కాలికంగా లోక్‌సభ సీట్ల నిష్పత్తి మారకపోవచ్చు. కానీ దీర్ఘకాలంలో చాలా ప్రతికూల పరిణామాలు కనిపిస్తాయి. ఇలాంటి బిల్లును మోదీ సర్కారు ఏకపక్షంగా తయారు చేయడం సరికాదు. చివరకు రాష్ట్ర అసెంబ్లీల సీట్లనూ 50 శాతం పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనిపైనా కూలంకశమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అని జైరాం రమేశ్ తెలిపారు.

# తమిళనాడులో కుల, మత హింసలేవీ లేవు

బీజేపీపై తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లాగా తమిళనాడులో కుల ఘర్షణలు, మత అల్లర్లు లాంటివి లేవని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడులో శాంతి, భద్రత మెరుగ్గా ఉందన్నారు. బుధవారం తిరుచిరాపల్లి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ' 'ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్న మూక దాడులు, మణిపూర్‌లో కొనసాగుతున్న అశాంతి తమిళనాడులో లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనిపించే పరిస్థితులు ఇక్కడ లేవు. బీజేపీ సృష్టించాలనుకున్న కుట్రలను కూడా మేం అడ్డుకున్నాం. మా ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఏర్పడింది.అందువల్ల పెట్టుబడులు స్థిరంగా పెరుగుతున్నాయి. దీనికి మద్దతుగా మేం ఎన్నికల ప్రణాళిక, మేనిఫెస్టో విడుదల చేశాం. ప్రకటించిన ప్రతి హామీని అమలు చేస్తాం. మేం చెప్పింది చేస్తాం, చేసినదే చెబుతాం. నేను కరుణానిధి కుమారుడిని' అని స్టాలిన్ తెలిపారు.

**అన్నాడీఎంకే, బీజేపీపై విమర్శలు**

గతంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న అన్నాడీఎంకే పాలనలో రాష్ట్రం వెనుకబాటుకు వెళ్లిందని విమర్శించారు. ఎడిప్పాడి కే పళనిస్వామి ప్రభుత్వం తన బంధువులకు కాంట్రాక్టులు ఇవ్వడానికే పనిచేసిందని ఆరోపించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తమిళనాడుకు సరైన నిధులు ఇవ్వలేదని అన్నారు. తిరుచిరాపల్లి జిల్లాలో గత ఐదేళ్లలో రూ.26,000 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేశామని స్టాలిన్ తెలిపారు. మహిళల హక్కుల భృతి పథకం ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులకు అల్పాహార పథకం, నాన్ ముదల్వన్ వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో తిరుచిరాపల్లిలో క్లీన్ స్వీప్ సాధించినట్లు గుర్తుచేస్తూ, ఈసారి కూడా అదే విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు.



**పళనిస్వామిని అన్ని నియోజకవర్గాల్లో ఓడించాలి : ఉదయనిధి స్టాలిన్**

అటు తమిళనాడు ఉప ముఖ్యమంత్రి కూడా ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిపక్షంపై విమర్శలు గుప్పించారు. అన్నాడీఎంకే నేత ఎడప్పాడి కే పళనిస్వామిని అన్ని నియోజకవర్గాల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఉదయనిధి తెలిపారు. మహిళలకు నెలకు రూ.1000 ఆర్థిక సాయం ఇప్పటికే అమల్లో ఉందని, తిరిగి అధికారంలోకి వస్తే దాన్ని రూ.2000కు పెంచుతామని చెప్పారు.

**విద్యార్థులకు పథకాల విస్తరణ**

ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు అందిస్తున్న అల్పాహార పథకాన్ని 8వ తరగతి వరకు విస్తరిస్తామని తెలిపారు. అదనంగా, గృహోపకరణాల కొనుగోలుకు రూ.8000 విలువైన కూపన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. విపక్ష విమర్శలకు సమాధానంగా, గతంలో పాఠశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇచ్చామని, ఇప్పుడు 10 లక్షల కాలేజీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించామని పేర్కొన్నారు

**తమిళనాడు రాజకీయాలు**

కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న ఒకే దశలో జరగనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది. ఈ ఎన్నికల్లో డీఎంకే మొత్తం 234 స్థానాల్లో 164 స్థానాలకు గానూ పోటీ చేయనుంది. మిగిలిన 70 స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించింది. అయితే, ఎన్నికల సమయం దగ్గర పడుతున్నకొద్దీ గెలుపే లక్ష్యంగా అధికార, విపక్షాలు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి ప్రచారం జోరుగా సాగుతోంది. రాజకీయ పార్టీల మధ్య విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరిపై ఒకరు విమర్శలు వర్షం కురిపిస్తున్నారు. అధికార డీఎంకే మరోసారి తమ పార్టీని నిలబెట్టుకోవాలని యోచిస్తోంది. ఈ ఎన్నికల్లో అధికార డీఎంకేను ఢీకొట్టేందుకు, అన్నా డీఎంకే, బీజేపీ సారథ్యంలోని విపక్ష కూటమి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి ఒంటరిగా బరిలోకి దిగారు.

## విమాన ఇంధన ధరలు పాక్షికంగా పెంపు

దేశీయ విమాన ప్రయాణికులపై భారాన్ని తగ్గించేందుకు విమాన ఇంధన ధరలను పాక్షికంగానే పెంచేందుకు అనుమతించామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశీయ విమానయాన సంస్థలకు విమాన ఇంధన ధరల పెరుగుదలను 25 శాతానికే పరిమితం చేశామని తెలిపింది. బుధవారం కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త మీడియా సమావేశంలో పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి అసంగ్బ చౌబా ఈవివరాలను చెప్పారు. దేశీయ విమానయాన సర్వీసుల నిర్వహణ వ్యయాలు పెరగకుండా నిలువరించేందుకే ఈ చర్యను చేపట్టామన్నారు. సామాన్యులకూ విమాన సర్వీసులను అందుబాటులో ఉంచాలని, సరుకు రవాణా సాఫీగా సాగాలని ప్రభుత్వం కోరుకుంటోందని ఆయన తెలిపారు.

**భారత్‌కు వచ్చే 2 నెలలకు సరిపడా చమురు సప్లైలు : కేంద్రం**

భారత్‌కు వచ్చే 2 నెలలకు సరిపడా ముడి చమురు సప్లైలు ఉన్నాయని పెట్రోలియం, సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. భారత చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) అన్నీ గరిష్ఠ కెపాసిటీతో పని చేస్తున్నాయని, దేశంలోని పెట్రోలు బంకుల్లో స్టాక్ అయిపోవడం అనేది ఎక్కడా జరగలేదని ఆమె తెలిపారు. 2 నెలల క్రితం 1 బ్యారెల్ బ్రెండ్ ముడి చమురు ధర 70 డాలర్లేనని, ఇప్పుడా రేటు 100 డాలర్లు దాటిందని సుజాత శర్మ గుర్తుచేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో భారీగా ముడి చమురు ధర పెరిగినా, దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలను ప్రభుత్వం పెంచలేదన్నారు. 2022 ఏప్రిల్ 6 నుంచి ఒక్కసారి కూడా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచకపోగా, 2024 మార్చిలో వాటి రేట్లను రూ.2 మేర తగ్గించారని ఆమె పేర్కొన్నారు. ఆ తగ్గిన రేట్లే ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల ఎఫెక్ట్ భారత ప్రజలపై పడకుండా చూసేందుకు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. పెట్రోలు, డీజిల్ విక్రయాలపై చమురు మార్కెటింగ్ కంపెనీలకు జరుగుతున్న నష్టాన్ని కేంద్ర సర్కారే భరిస్తోందని సుజాత శర్మ పేర్కొన్నారు.

## 'ఎన్నికల ప్రచారంలో భద్రతా లోపాలు'

తన ఎన్నికల ప్రచారంలో భద్రతా లోపాలు జరిగాయంటూ టీవీకే అధినేత, దళపతి విజయ్ ఆరోపించారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, హోం శాఖ కార్యదర్శికి లేఖలు రాశారు. ఇది ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో సంచనలంగా మారింది. సోమవారం నామినేషన్ వేసిన అనంతరం పెరంబూర్ నుంచి కొళత్తూర్‌కు వెళ్లే మార్గంలో జరిగిన ఉదంతం గురించి ఆయన లేఖలో వివరించారు. తన కాన్వాయ్ వెళ్లే మార్గంలో పోలీసు భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ సరిగ్గా లేకపోవడం, ఫలితంగా తాను ప్రయాణించే కాన్వాయ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడం వంటి విషయాల గురించి లేఖలో ప్రస్తావించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తనకు ‾ కేటగిరీ భద్రతా కేటాయించిందని విజయ్ గుర్తు చేశారు. అయితే, ప్రోటోకాల్ ప్రకారమే తన ప్రయాణాన్ని కొనసాగించానని ఆయన తెలిపారు. అలాగే, తన ప్రచారానికి అవసరమైన అన్ని అనుమతులు పొందిన తర్వాతే ప్రచారంలో పాల్గొన్నానని చెప్పుకొచ్చారు. పెరంబూర్‌లో ప్రచారం అనంతరం, కొళత్తూరు నియోజకవర్గంలోని తదుపరి ప్రచార వేదికకు బయలుదేరానని, ఆ సమయంలో తగినంత భద్రతా ఏర్పాటు లేకపోవడం వల్ల కాన్వాయ్?కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని విజయ్ చెప్పుకొచ్చారు.

**జోక్యం చేసుకోవాలి!**

తమిళనాడు రాష్ట్ర పోలీసు యంత్రాంగం తన భద్రత విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విజయ్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించాల్సి ఉందని, ఈ విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాలని కోరారు. ఎన్నికల ర్యాలీతో సహా, బహిరంగ కార్యక్రమాల్లో తాను పాల్గొన్నప్పుడు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేసే విధంగా తమిళనాడు పోలీసులను ఆదేశించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, వ్యక్తుల రక్షణ కోసం ఉద్దేశించిన 'ఎల్లో బుక్'? మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. రాబోయే రోజుల్లో తన ఎన్నికల ప్రచారంలో ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా చర్యలు వెంటనే తీసుకోవాలని విజయ్? కోరారు.

**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరం**

తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలకు గానూ ఏప్రిల్? 23న ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. విజయ్ ఈ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో పోటీ చేస్తున్నారు. పెరంబూర్ ఒకప్పుడు కమ్యూనిస్ట్ పార్టీలకు బలమైన కోట. ప్రస్తుతం ఇక్కడ డీఎంకే అభ్యర్థి ఆర్.డి. శేఖర్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. తిరుచ్చి ఈస్ట్ స్థానంలో డీఎంకేకు చెందిన ఇనిగో ఎస్. ఇరుదయరాజ్‌తో విజయ్ తలపడుతున్నారు. మధ్య తమిళనాడులో తన పట్టును నిరూపించుకోవడానికి ఈ స్థానాన్ని ఎంచుకున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గంలో టీవీకే తరపున వి.ఎస్. బాబును విజయ్ రంగంలోకి దించారు. డీఎంకే మొత్తం 234 స్థానాల్లో 164 స్థానాలకు గానూ పోటీ చేయనుంది. మిగిలిన 70 స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించింది. ఇదిలా ఉండగా, ఎన్నికల సమయం దగ్గర పడుతున్నకొద్దీ గెలుపే లక్ష్యంగా అధికార, విపక్షాలు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అధికార డీఎంకే మరోసారి తమ పార్టీని నిలబెట్టుకోవాలని యోచిస్తుండగా, ఈ సారి ఎన్నికల్లో అధికార డీఎంకేను ఎలాగైనా ఢీకొట్టాలని అన్నా డీఎంకే, బీజేపీ సారథ్యంలోని విపక్ష కూటమి సిద్ధంగా ఉన్నాయి. మరోవైపు, రాష్ట్రంలో మూడో అతిపెద్ద రాజకీయ శక్తి తన పార్టీయేనని టీవీకే అధినేత, దళపతి విజయ్ చెబుతున్నారు. తనను తాను సీఎం అభ్యర్థిగా ప్రకటించుకున్న ఆయన, ఒంటరిగానే పోరాటం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇక దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ తన కొత్త పార్టీతో ఎన్నికల్లో పాల్గొన్నారు. అయితే, డీఎంకే మినహా ఎవరితోనైనా చేతులు కలుపేందకు తాను సిద్ధంగా ఉన్నానని ఆమె వ్యాఖ్యానించారు.

## బంగాల్‌లో ఎస్ఐఆర్

బంగాల్ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పురోగతిపై సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. 60 లక్షల అభ్యంతరాల్లో సుమారు 47.4 లక్షల అభ్యంతరాలు మార్చి 31 నాటికి పరిష్కారమైన విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం గుర్తించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పంపిన 2 నివేదికలను బుధవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పాంచోలిల త్రిసభ్య ధర్మాసనం పరిశీలించింది. రోజుకు దాదాపు 1.75 లక్షల నుంచి 2 లక్షల అభ్యంతరాలను పరిష్కరిస్తుండడంపై సంతృప్తి వ్యక్తం చేసింది. 'మేము ఈ గణాంకాల పట్ల సంతోషంగా, ఆశాభావంతో ఉన్నాం' అని సీజేఐ వ్యాఖ్యానించారు.

**19 అప్పీలేట్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు**

కాగా, ఓటర్ల జాబితాలోని పేర్లు తొలగించడం లేదా కొత్త పేర్లను చేర్చడంపై వచ్చే అప్పీళ్లను విచారణ చేయడానికి, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులతో 19 అప్పీలేట్? ట్రిబ్యునల్స్?ను ఏర్పాటు చేసినట్లు ఈసీ సర్వోన్నత న్యాయస్థానానికి తెలియజేసింది. కోల్?కతా జలశక్తి మంత్రిత్వ శాఖలో– సభ్యులకు 8 వారాల పాటు నిర్వహించే ఓరియంటేషన్ కార్యక్రమం ముగిసిన తర్వాత ఈ ట్రిబ్యునళ్లు పని ప్రారంభిస్తాయని పేర్కొంది. దీనితో బంగాల్, ఒడిశా, ఝార్ఖండ్? రాష్ట్రాలకు చెందిన 700 మంది జ్యుడీషియల్ అధికారులు– అని రికార్డులను ఈ ట్రిబ్యునళ్లకు అందుబాటులో ఉంచాలని సీజేఐ ఆదేశించారు. ట్రిబ్యునళ్లు సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా తమ సొంత విధివిధానాలను రూపొందించుకోవచ్చునని, అయితే ధ్రువీకరణ లేకుండా కొత్త పత్రాలను అనుమతించకూడదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, జ్యుడీషియల్ అధికారులు, ట్రిబ్యునల్ సభ్యులు, సిబ్బందికి గౌరవ వేతనం సహా ఇతర ఖర్చులను సకాలంలో చెల్లించేలా చూడాలని ఈసీ, బంగాల్? ఎన్నికల అధికారిని సుప్రీంకోర్టు ఆదేశించింది.

**పెండింగ్?లో ఉన్నవాటి పరిస్థితి ఏమిటి?**

ఎస్?ఐఆర్?పై దాఖలైన మొత్తం 60 లక్షల అభ్యంతరాల్లో దాదాపు 47.4 లక్షల అభ్యంతరాలు పరిష్కారమయ్యాయి. ఇక పెండింగ్?లో ఉన్న అభ్యంతరాలు అన్నీ ఏప్రిల్ 7 నాటికి పరిష్కారమయ్యే అవకాశం ఉందని హైకోర్టు చీఫ్ జస్టిస్? తన నివేదికలో పేర్కొన్నారు. దీనితో బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్లతో సహా, అన్ని పిటిషన్లపై తుదపరి విచారణను ఏప్రిల్ 9కు వాయిదా వేసింది సుప్రీంకోర్టు. మరోవైపు పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదులు, ఓటర్ల తొలగింపు రేటు 45 శాతం వరకు ఉందని, ఇది ఎంతో ఆందోళనకరమైన విషయమని కోర్టుకు తెలిపారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

-మొదటిపేజీ తరువాయి

ఈనెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని వెల్లడించారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేరళం పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి బుధవారం.. ఈ పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 2 నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లవలసిన పనిలేకుండా తన ఇంటి నుంచే భూ సేవలు పొందే విధంగా పోర్టల్‌ను రూపొందించామని అన్నారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారని.. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చున్నారు. రైతు



లాగిన్ అయిన వెంటనే తనకు ఉన్న భూమి వివరాలు కనిపిస్తాయి. ఎన్నిఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు ఎంతచెల్లించాలో కనిపిస్తుంది. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతుంది. ఆతర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమేగాక సర్వేకూడా రోవర్లతో పూర్తి చేస్తారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ స్ర్యూటినీకి వెళుతుంది. ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పిఎమ్, భూధార్ నెంబర్‌ల కేటాయింపు జరుగుతుంది. ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయి. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ ను జనరేట్ చేసి భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ ఎమ్ ఎస్ అలర్ట్స్ పంపిస్తారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ ( ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, అదేవిధంగా ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని వెల్లడించారు. ఈ ఐదు మండలాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నతర్వాత సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామని అలాగే గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. దీనివల్ల సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, కచ్చితమైన సర్వే వివరాలు వస్తాయని తెలిపారు. భూ సమస్యలు రైతు జీవితం లో పెద్ద అడ్డంకిగా మారాయని వాటికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఒక కీలకమైన ముందడుగు అని రైతు ఇంటి నుంచే అన్నిసేవలు పొందేలా పారదర్శక వ్యవస్థను తీసుకువస్తున్నామని ఇది రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పునకు నాంది అవుతుందని మంత్రి పొంగులేటి అన్నారు.

# వాటర్ వార్

-మొదటిపేజీ తరువాయి

ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకంరెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీళ్ల లొల్లి మరోసారి వివాదాన్ని రాజేసింది. కృష్ణా జలాల విషయంలో ఏపీ తీరుపై తెలంగాణ ఎమ్మెల్యేలు కన్నెర్ర చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో వాటర్ డెడ్ స్టోరేజ్ కు పడిపోయినా.. ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేయడంపై తెలంగాణ లీడర్లు గుర్రుగా ఉన్నారు. ప్రతీసారి కేంద్రానికి, ఐఖీఓఃకి లేఖల ద్వారా ఫిర్యాదు చేసే తెలంగాణ..ఈ సారి కాస్త సీరియస్‌గా రియాక్ట్ అయింది. ఏపీతో అమీతుమీ తేల్చుకునేందుకు ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు దగ్గర ధర్నా చేసేందుకు రెడీ అయ్యారు నేతలు. లాస్ట్ మినిట్‌లో ఏపీ సర్కార్ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయడంతో..తెలంగాణ నేతలు ధర్నా ఆలోచనను విరమించుకున్నారు.కృష్ణా జలాల విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య ఎప్పటినుంచో వివాదం నడుస్తూనే ఉంది. రాష్ట్ర విభజన నాటి నుంచి వాటర్ వార్ ఇంకో టర్న్ తీసుకుంది. రాష్ట్ర విభజన సందర్భంగా కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు తాత్కాలిక కేటాయింపులు చేశారు. 811 టీఎంసీల నికర జలాలలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చేశారు. 2014లో తాత్కాలిక కేటాయింపులు చేసినా.. ఇప్పటికీ అవే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 43 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు మొత్తం 885 అడుగులు ఉంటే..ప్రస్తుతం 824 అడుగులకు నీటిమట్టం పడిపోయింది. ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజ్‌కు పడిపోయింది.డెడ్ స్టోరేజ్‌కు దగ్గరపడితే..సమ్మర్‌లో తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని..ఉమ్మడి రాష్ట్రంలోనే ఒక నిర్ణయం తీసుకుని దాని ప్రకారమే నడుచుకుంటున్నారు. జీవో కాని ఈ కండీషన్‌ను ఖతం పట్టించి..ఏపీ కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఎడమగట్టు నుంచి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేసినా..ఏపీ మాత్రం కుడివైపు నుంచి కంటిన్యూ చేస్తోంది. ఇలాగే చేస్తే మునుముందు ఇబ్బందులు తప్పవని..ఉమ్మడి పాలమూరు జిల్లా నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం విద్యుత్‌శాఖను నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..ఏపీ ప్రభుత్వ పెద్దలకు ఫోన్ చేసి చెప్పారు. కానీ ఏపీ అలాగే విద్యుత్ ఉత్పత్తి చేయడంతో.. ఉమ్మడి పాలమూరు నేతలు ఆందోళన బాట పట్టాలని డిసైడ్ అయ్యారు.శ్రీశైలం నుంచి ఏపీ అలాగే విద్యుత్ ఉత్పత్తి చేస్తే..కల్వకుర్తి ఆయకట్టుకు నీరు ఆగిపోయే ప్రమాదం ఉంది. యాసంగి పంట చివరి దశకు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు నీరు ఇవ్వకపోతే..రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కనీసం 15 రోజుల పాటు కల్వకుర్తి ఆయకట్టుకు నీరు అందించాలంటే.. ఏపీ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం తరఫున చేసిన వినతికి ఏ మాత్రం స్పందించకపోవడంతో..ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు దగ్గరే ఆందోళన చేయాలని డిసైడ్ అయ్యారు. ఏకంగా మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డిలు శ్రీశైలం డ్యామ్ మీద ధర్నా చేయాలని నిర్ణయించారు. చివరి నిమిషంలో ఏపీ విద్యుత్ నిలిపేయడంతో ఆందోళనను విరమించుకున్నారు. ఈ పరిస్థితి మరోసారి పునరావృతం అయితే..డ్యామ్ పైన వంటవార్పు చేస్తామని హెచ్చరించారు. అయితే ఏపీ, తెలంగాణ మధ్య నీళ్ల వివాదం ధర్నాలకు వెళున్నా.. వివాదాలను అదుపు చేయాల్సిన కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు సైలెంట్ గా ఉండటం చర్చనీయాంశంగా మారింది. శ్రీశైలం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజ్ కు పడిపోయినా.. ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేస్తుంటే ఐఖీఓః చూస్తూ ఉండిపోయిందని తెలంగాణ నేతలు ఫైర్ అవుతున్నారు. అందుకే ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు స్వయంగా రంగంలోకి దిగారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ విషయంలో కృష్ణా బోర్డు ఇకనైనా నిబంధనలు పాటించేలా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. బోర్డు ఇలాగే మౌనంగా ఉంటే..తమదైన శైలిలో ఆందోళన బాటపడుతామంటూ పాలమూరు జిల్లా నేతలు గట్టి ఇండికేషన్ ఇచ్చారు. ఈ నీళ్ల లొల్లి ఎప్పుడు తెగుతుందో? కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు పంచాయితీని తెంపుతుందో లేదో చూడాలి మరి.

# అజార్‌కు అమాత్య.. యోగం ఉన్నట్టా.. లేనట్టా

ఖమ్మం : అజారుద్దీన్ మంత్రి పదవి ఉంటుందా.. ఊడుతుందా.. తెలంగాణ రాజకీయవర్గాల్లో జోరుగా వినిపిస్తున్న చర్చ ఇది. దీనికి కారణం.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉండడమే ! ఏ చట్టసభల్లో సభ్యుడిగా లేకపోయినా.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా అజారుద్దీన్‌ను మంత్రిని చేసింది కాంగ్రెస్ సర్కార్. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ చేస్తూ రేవంత్ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఆ ఫైల్ గవర్నర్ దగ్గరే ఉంది. మంత్రి పదవి కొనసాగాలంటే.. ఆరు నెలల్లోగా శాసనసభ లేదా శాసన మండలిలో అజారుద్దీన్‌కు సభ్యత్వం తప్పనిసరి. ఐతే వచ్చే నెల 30వ తేదీతో.. ఆయన మంత్రి పదవి చేపట్టి ఆరు నెలలు ముగుస్తుంది. ఇంకా 30 రోజులు మాత్రమే టైమ్ ఉండటంతో.. ఇప్పుడేం జరగబోతుందనేది ఆసక్తి రేపుతోంది. గవర్నర్ దగ్గర ఫైల్ ఇలానే పెండింగ్‌లో ఉంటే పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోంది. ఐతే దీనికి రేవంత్ సర్కార్ ప్లాన్ బీ సిద్ధం చేసిందనే టాక్ నడుస్తోంది.అక్టోబర్ 31న తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ రోజు నుంచి 6 నెలల లోపు చట్టసభల్లో సభ్యుడు కావాలి. అంటే ఏప్రిల్ 30లోపు ఆయన చట్టసభల్లో సభ్యుడు కావాలన్న మాట. నాలుగు నెలల కిందటే.. కేబినెట్ ఆమోదించి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అజారుద్దీన్‌ను నామినేట్ చేసింది. ఐతే బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టులో కేసు వేశారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ ఫైల్‌ను గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. ఈ మధ్యే విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. మరోసారి గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే..



హైకోర్టుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అజారుద్దీన్ మంత్రి పదవి విషయంలో ఏం జరగబోతుందనే ఆసక్తి కనిపిస్తోంది.ఈ మధ్యే రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చారు. దీంతో మరోసారి గవర్నర్‌ను కలిసేందుకు సీఎం రేవంత్ సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది. ఏప్రిల్ మొదటి వారం గవర్నర్‌తో భేటీ అయి.. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరనున్నట్లు సమాచారం. మళ్లీ కోర్టుకు వెళ్తే ఆలస్యం అవడం తప్ప.. వచ్చే లాభం లేదని, వీలైనంత త్వరగా ఫైల్ క్లియర్ చేయాలని గవర్నర్‌ను ప్రభుత్వ పెద్దలు కోరనున్నారట. ఐతే సాంకేతిక కారణాలతో ఫైల్‌ను గవర్నర్ పెండింగ్‌లో పెడితే మాత్రం.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి గండం తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయ్. దీంతో ప్రభుత్వ పెద్దలు ప్లాన్ ః అమలు చేసేందుకు రెడీ అవుతున్నారట. ఒకవేళ గవర్నర్ నుంచి సానుకూల స్పందన రాకపోతే.. అజారుద్దీన్ చేత రాజీనామా చేయించి.. మే రెండో వారంలో జరిగే కేబినెట్ విస్తరణలో మరోసారి అవకాశం కల్పించాలనే ఆలోచన చేస్తున్నారని టాక్.ఓవరాల్‌గా లాస్ట్ బాల్‌కు అజారుద్దీన్ సిక్స్ కొడతారా.. డకౌట్ అవుతారా అనేది గవర్నర్ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. ఇక అటు త్వరలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయ్. ఇలాంటి సమయంలో అజారుద్దీన్‌కు మంత్రి పదవి దూరం అయితే.. కాంగ్రెస్‌కు సమస్యగా మారే అవకాశం ఉంటుంది. దీంతో ఈ విషయంపై రేవంత్ సర్కార్ సీరియస్‌గా ఉంది. గవర్నర్ నిర్ణయం సానుకూలంగా లేకపోతే? ప్లాన్ ః అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది

## మీ సేవ కేంద్రాల్లో సర్వీసు ధరలు పెంపు

-మొదటిపేజీ తరువాయి

ఇవి నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. మీ సేవ కేంద్రాల నిర్వహణ ఖర్చు పెరిగినందువల్ల ధరలను పెంచాలని నిర్వాహకులు కోరారు. ఈ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ధరల సవరణ చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల ధరల పెంపు చోటుచేసుకుంది.

## ఏప్రిల్ 15 నుంచి రైతు భరోసా

-మొదటిపేజీ తరువాయి

మూడో విడతలో అన్ని ఎకరాలకు రూ.6 వేల చొప్పున జమ చేయనుంది. ఇప్పటికే తొలి విడత నగదు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవ్వగా.. ఈ క్రమంలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాస్ బుక్‌లు పొందిన రైతులకు కూడా రైతు భరోసా అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరికి ఏప్రిల్ 15వ తేదీ నుంచి నిధులు జమ చేయాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పాస్ బుక్ పొందిన 85 వేల మంది రైతులు ఉండగా.. వీరిలో 62 వేల మంది రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. వీళ్లు రైతు భరోసాకు అర్హత కలిగి ఉన్నారా.. లేదా అనేది తనిఖీ చేపడుతోంది. అనంతరం నిర్ధారణ చేపట్టి లబ్దిదారుల జాబితాలో చేర్చనుంది. 10 రోజుల్లో అర్హుల జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు. అర్హత పొందినవారికి ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్యలో రైతు భరోసా విడుదల చేయనున్నారు.

**ఖరీఫ్ సీజన్‌లో 9 రోజుల్లోనే..**

యాసంగి సీజన్‌లో మొత్తం రూ.9 వేల కోట్లను రైతులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత వానాకాలం సీజన్‌లో లబ్ది పొందిన రైతులందరికీ ఈ సారి కూడా అందిస్తోంది. ఎవరికి ఎలాంటి కోతలు విధించలేదు. ఇక కొత్తగా పాస్ బుక్‌లు పొందినవారికి కూడా అందించాలని నిర్ణయించింది. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 69.39 లక్షల మంది రైతులకు రూ.8,744 కోట్లను విడుదల చేసింది. అప్పట్లో 9 రోజుల్లోనే రైతులందరి ఖాతాల్లో వేసింది. తొలి రోజు ఎకరం భూమి ఉన్న రైతులకు మొదలుపెట్టి.. 9 రోజుల్లో అందరికీ జమ చేసింది. అయితే ఈ సారి నిధుల విడుదలకు సంబంధించి కొత్త గైడ్ లైన్స్ పాటిస్తోంది. ఎన్ని ఎకరాలు కలిగి ఉన్నా.. తొలి ఎకరానికి తొలి విడతలో జమ చేసింది. దీంతో ఒకేసారి అందరికీ లబ్ది చేకూరినట్లయింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కొత్తగూడెం కేంద్రంగా డివిజన్ ...

**ఖమ్మం :** కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లకు రాకపోకలు సాగించే రైళ్లకు కూడలిగా మారినందున దాన్ని ప్రధానకేంద్రంగా మార్చాలన్నారు. కొత్తగూడెంకు బ్రిటిష్‌పాలన నుంచి చారిత్రక నేపథ్యం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఇక్కడి నుంచి బొగ్గు రవాణా జరిగేదని.. సింగరేణి కాలరీస్‌కు ఇప్పుడు ఇది ఒక ప్రధాన కేంద్రంగా మారిందన్నారు.గూడ్స్ ట్రైన్ల రవాణా ద్వారా భారతీయ రైల్వేకు అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న ప్రాంతాల్లో కొత్తగూడెం ఒకటి అన్నారు. కొత్తగూడెం–కిరండోల్, మల్కన్‌గిరి–భద్రాచలం, కొత్తగూడెం–సత్తుపల్లి–కొవ్వూరు, జునాగఢ్–మల్కన్‌గిరి–భద్రాచలం లింకులతో ఈ స్టేషన్ నాలుగు రాష్ట్రాల ప్రధాన కూడలిగా మారిందని వెల్లడించారు. 2032 నాటికి వందేళ్లు పూర్తిచేసుకోబోతున్న ఈ స్టేషన్‌కు తగిన గుర్తింపు ఇవ్వాలని స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారని గుర్తు చేశారు. శతవసంతాల గుర్తుగా కొత్తగూడెం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని ఎంపీలు కేంద్రమంత్రికి సమర్పించిన వినతిపత్రంలో వెల్లడించారు.కాగా, కొత్తగూడెం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంత సామాజిక, ఆర్థిక ముఖచిత్రం గణనీయంగా మారుతుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉండటం వల్ల పరిపాలనాపరమైన నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని... కొత్తగూడెం కేంద్రంగా డివిజన్ ఏర్పాటైతే ఈ ప్రాంతానికి స్వయంప్రతిపత్తి లభించి, రైల్వే మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమవుతుందని చెబుతున్నారు. సింగరేణి కాలరీస్, కె.టి.పి.ఎస్, ఐటిసి వంటి భారీ పరిశ్రమలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని... బొగ్గు రవాణా ద్వారా రైల్వేకు వచ్చే భారీ ఆదాయం ఇక్కడి అభివృద్ధికి తిరిగి వినియోగించబడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.స్థానిక ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త రైళ్లను ప్రారంభించేందుకు, రైళ్ల సమయాలను క్రమబద్ధీకరించేందుకు వీలవుతుంది. భద్రాచలం వంటి పుణ్యక్షేత్రానికి దేశవ్యాప్త అనుసంధానం పెరుగుతుందని అంటున్నారు. డివిజనల్ కార్యాలయం ఏర్పాటుతో వందలాది మందికి ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. స్థానిక వ్యాపారాలు పుంజుకుంటాయని చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ల నిర్మాణం, స్టేషన్ల ఆధునీకరణ పనులు వేగంగా పూర్తవుతాయని.. కొత్తగూడెం రైల్వే డివిజన్ ఏర్పాటు కేవలం రవాణా సౌకర్యమే కాకుండా, వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్‌లా పనిచేస్తుందని అంటున్నారు.

## 2027 నాటికి మూమునూరు ఎయిర్ పోర్ట్



**వరంగల్ :** హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే ప్రఖ్యాతి పొందింది. అయితే ఇప్పుడు తెలంగాణలోని మరో ఎయిర్ పోర్ట్ నిర్మాణంతో మరోసారి విమాన రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే అవకాశం ఉందని కొందరు అంటున్నారు. వరంగల్ జిల్లా మూమునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించి సాంకేతిక సహాయం అందించేందుకు వరంగల్ నీట్ కు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయగా.. తదుపరి చర్యల్లో భాగంగా సాంకేతిక సహాయం తో పాటు సూపర్వైజింగ్ చేయాలని ప్రభుత్వం నీట్ ను కోరింది. దీంతో ఈ ఎయిర్‌పోర్ట్ పై ఇప్పుడు ఆసక్తిగా చర్చ సాగుతోంది.వరంగల్ జిల్లాలోని మూమునూరు లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి రూ. 850 కోట్లు అవసరం ఉండనుంది. ఇందులో ఆధునిక టెర్మినల్ భవనానికి, రహదారి ఏర్పాట్లకు, ట్రాఫిక్ కంట్రోల్ తో పాటు ఫైర్ సేఫ్టీ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా 2027 చివరి నాటికి ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంది. అయితే ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో వరంగల్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని కొందరు అంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో ఐటీ సెక్టార్ ఎదిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో ఇక్కడ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.అలాగే ఇక్కడ మెగా టెక్స్టైల్ పార్క్ కూడా ఏర్పాటు కావడంతో ఇది అంతర్జాతీయంగా కనెక్ట్ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ఇలా పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెబుతున్నారు. ఉత్తర తెలంగాణలోని ఎయిర్‌పోర్ట్ ప్రత్యేకంగా నిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.1930 లా కాలంలో ఈ ఎయిర్ పోర్టును ప్రారంభించారు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పై అజాం జాహి మిల్స్ వంటి పరిశ్రమల సహాయంగా దీనిని ఏర్పాటు చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ సైన్యం 1948 ఆపరేషన్ పోలో లో భాగంగా ఉపయోగించారు. 1959లో జవహర్లాల్ నెహ్రూ కూడా ఇక్కడ దిగినట్లు చరిత్ర తెలుపుతుంది. ఈ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణకు 2025లో కేంద్రం ఆమోదం తెలిపింది. మొత్తం 950 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ ఎయిర్‌పోర్టులో దేశీయ విమాన సేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సమస్యను పరిష్కరించిన జిల్లా ఎస్పీ

**రూ. 8 లక్షల డబ్బులు బాధితులకు అందజేత**

**శాలువాతో ఎస్పీకి సత్కరించిన బాధితులు**



**వాస్తవ నేస్తం,అదిలాబాద్ బ్యూరో :** అయిదేళ్ల క్రితం వ్యవసాయ అధికారికి అత్యవరంగా డబ్బులు అవసరం ఉండడంతో ముగ్గురు కలిసి రూ. 8 లక్షలు నగదు ఇచ్చారు. ఇచ్చిన డబ్బులను రిలీరిగి ఇవ్వాలని పలుసార్లు సదరు అధికారికి అడిగితే ఫలితం లేకపోయింది. ఇచ్చిన డబ్బులు ఇక రావని మోస పోయామని ముగ్గురు భావించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, బాధితులకు న్యాయం చేస్తున్నారు. అయిదేళ్ల క్రితం మోసపోయిన ముగ్గురు బాధితులు తమకు న్యాయం చేయాలంటూ మూడు రోజుల క్రితం ప్రజా పిర్యాదుల విభాగంలో జిల్లా ఎస్పీకి గోడును వినిపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బజార్ హత్నూర్ మండలం చందు నాయక్ తండాకు చెందిన రాజేశ్వర్ ఏఈఓ, మరో ఇద్దరు రైతులు రబ్డే రవి, పడ్వల్ రవీందర్ ముగ్గురు కలిసి గతంలో పని చేసిన బోథ్ అగ్రికల్చర్ ఏవో, ద్యాగాల భాస్కర్ కు రూ. 8 లక్షలు అత్యవసర పరిస్థితులు ఉన్నవి అని అడుగగా ఇవ్వడం జరిగింది. ఎన్నిసార్లు అడిగినా ఇచ్చిన డబ్బులు సదరు అధికారి తిరిగి డబ్బులు ఇవ్వలేకపోయాడు. జిల్లా ఎస్పీ వెంటనే బోథ్ సీఐ డీ గురుస్వామికి ఆదేశించి, సమస్య సామరస్యంగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ముగ్గురి వద్ద అప్పు తీసుకున్న వ్యక్తిని ప్రత్యేకంగా పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చాడు. తీసుకున్న అప్పు డబ్బులను రెండు నెలల్లో తిరిగి ఇస్తానని సదరు అధికారి చెప్పారు. గత నెల మార్చి 30 న బాధితులకు పూర్తి డబ్బులను తిరిగి ఇచ్చాడు. అప్పుగా ఇచ్చిన డబ్బులు ఇక రావనుకు న్నామని, జిల్లా ఎస్పీ చొరవతో తిరిగి వచ్చాయని బాధితులు స్పష్టం చేశారు. బుదవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో బాధితులు ఎస్పీకి శాలువా తో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# నేలవాలిన వరి.. తడిసి ముద్దయిన రైతన్న కష్టం



**వాస్తవ నేస్తం,కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంతో పాటు కల్లూరు మరియు చుట్టుపక్కల గ్రామాల్లో ఆదివారం విరుచుకుపడ్డ అకాల తుపాను గాలులు, భారీ వర్షం రైతన్నలను నిలువునా ముంచాయి. ఆరుగాలం కష్టపడి, కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన వరి పంట చేతికి అందే సమయంలో ప్రకృతి ప్రకోపానికి గురై నేలకొరగడంతో రైతు కంట నీరు ఆగడం లేదు. ముఖ్యంగా కల్లూరు గ్రామంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు ఈదురు గాలుల ధాటికి పూర్తిగా నేలపాలయ్యాయి. దీనివల్ల గింజ రాలిపోవడమే కాకుండా, ధాన్యం నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, ఇప్పటికే కోతలు పూర్తి చేసి ఆరబెట్టిన ధాన్యం పరిస్థితి మరింత దయనీయంగా మారింది. విక్రయానికి సిద్ధంగా ఉంచిన వడ్లు వర్షపు నీటిలో తడిసి ముద్దయ్యాయి. పూర్తిగా ఆరిపోయిన ధాన్యం ఒక్కసారిగా తడిచిపోవడంతో మొలకలు వచ్చే అవకాశం ఉందని, దీనివల్ల కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభించడం కష్టమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి సాగు చేసిన పంట కళ్లముందే నాశనమవ్వడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన తమను ఆదుకోవాలని కల్లూరు మరియు పోతంగల్ మండల రైతులు కోరుతున్నారు.

# ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

## పోతంగల్‌లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ





**వాస్తవ నేస్తం,కోటగిరి :** నిజామాబాద్ జిల్లా పోతంగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి మందిర విగ్రహ ప్రతిష్ఠాపన మరియు ప్రారంభోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం నుంచే గ్రామం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది; ఊరంతా తోరణాలు, కేసరి రంగు జెండాలతో అలంకరించబడి పండుగ వాతావరణాన్ని తలపించింది. వేకువజాము నుంచే వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవాచనం వంటి కార్యక్రమాలతో హోమగుండాల వద్ద క్రతువులు సాగాయి. మధ్యాహ్నం వేళలో గ్రామంలో నిర్వహించిన భారీ ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. భక్తులందరూ కేసరి రంగు కండువాలు ధరించి, “జై శ్రీరామ్.. జై హనుమాన్” అంటూ చేసిన నినాదాలు ఊరి పొలిమేరల వరకు మార్మోగాయి. ఒక కళాకారుడు హనుమంతుడి వేషధారణలో గద పట్టుకొని భక్తుల మధ్య తిరుగుతుంటే, సాక్షాత్తు ఆ స్వామి వారే గ్రామంలోకి విచ్చేసినట్లుగా అనిపించింది. మహిళలు తమ పిల్లలతో కలిసి సంప్రదాయ దుస్తుల్లో హాజరై, మంగళ వాయిద్యాల మధ్య భజనలు చేస్తూ స్వామి వారిని కొలిచారు.మూడు రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు హోమ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి కాగా, బుధవారం (ఏప్రిల్ 1) రెండవ రోజు విశేష పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం బసవ లింగం అవధూత్ మహరాజ్ గారి ప్రవచన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక ప్రసంగాన్ని వినేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఘట్టం మూడవ రోజు ఏప్రిల్ 2న జరగనుంది; ఆ రోజే విగ్రహ ప్రతిష్ఠాపన మరియు పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయనున్నారు. గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఈ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడం, ఇప్పుడు అంతా కలిసి ఈ వేడుకను జరుపుకోవడం పోతంగల్ గ్రామంలో ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్లూరులో హరినామ సప్త ముగింపు

## రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారుల సందడి

**వాస్తవ నేస్తం,కోటగిరి :** పోతంగల్ మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో గత ఏడు రోజులుగా ఆధ్యాత్మిక ఉత్సాహంతో కొనసాగుతున్న అఖండ హరినామ సప్త వేడుకలు ముగిశాయి. సప్తలో భాగంగా ఏడవ రోజు నిర్వహించిన 'బరోడు' కార్యక్రమం అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా గ్రామంలోని పురవీధుల గుండా నిర్వహించిన శోభాయాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భజన కీర్తనలు, తాళాల మ్రోతలు, కోలాటాల నడుమ గ్రామస్తులందరూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు.ఈ ఊరేగింపులో రాధాకృష్ణుల వేషధారణలో ఇద్దరు చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆ చిన్నారులను చూస్తుంటే సాక్షాత్తు ఆ రాధాకృష్ణులే ధారుణికి దిగివచ్చి, కల్లూరు పురవీధుల్లో విహరిస్తున్నారా అన్నట్లుగా అద్భుతంగా అనిపించింది. చిన్నారుల నృత్యాలు, వేషధారణ భక్తులకు కనువిందు చేశాయి.గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని హరినామ స్మరణతో కల్లూరును పునీతం చేశారు. ముగింపు వేడుకల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు.



## గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**కామగిరిలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం**



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ :** పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను గడువులోపు పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని కామగిరి గ్రామంలో బుద వారం ఇందిరమ్మ ఇండ్ల గ్రహప్రవేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మించుకునే ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల నిధులను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వెనుకబడి ఉన్నట్లయితే వేగవంతం పెంచాలని అధికారులకు ఆదేశించారు. ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని కలెక్టర్ లబ్ధిదారులకు సూచించారు. స్తానిక సర్పంచ్ నిమ్మల సుప్రియ, ఉప సర్పంచ్ విజయకాంత, జిల్లా అదనపు అధికారి రాజేశ్వర్, తాసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీ వో రవీందర్, జీపీవో కర్ణాకర్ రెడ్డి, హౌసింగ్ ఏఇ హర్ష, ఈజీఎస్ ఏపీవో నరేందర్ గౌడ్, పంచాయతీ కార్య దర్శి అజాహారుద్దీన్, ఈజీఎస్ క్షేత్రస్థాయి అధికారి నిమ్మల సుధాకర్ రెడ్డి, గ్రామస్తు లు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ పై కేసు నమోదు చెయ్యాలి



**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండలంలోని కరంజి(టీ)రోడ్డు మార్గంలో పనులు చేపట్టిన తిరుమల కాంట్రాక్టర్ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని వారి పై కేసు నమోదు చేయాలని భీంపూర్ ఎస్ఐ ను బుధవారం బీఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్,కేమ శ్రీకాంత్ లు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాంసి మండలం సవర్గవ్ నుండి భీంపూర్ మండలం నిపాని వరకు ఉన్న అంతరాష్ట్ర రోడ్డు ను తవ్వేసి మధ్యలోనే రోడ్డు పనులను ఆపేసి రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడం వలన ప్రమాదాలు,మరణాలు,తీవ్ర గాయాలు సంభవించాడమే కాకుండా ఆర్టీసీ బస్సులు,అంబులెన్సులు వంటి ప్రభుత్వ వాహనాలకు భారీ నష్టం వాటిల్లుతుందని.ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా నిర్లక్ష్యం వహించిన సదరు కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమంలో సర్పంచులు కాల్చుప్ యాదవ్,వినోద్, నాయకులు ప్రవీణ్,కపిల్, రవీందర్, కుడ్మెత సంతోష్, అనీల్,ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు



**వాస్తవ నేస్తం కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. గ్రామంలోని అంతర్గత రహదారుల అభివృద్ధిలో భాగంగా 5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 120 మీటర్ల పొడవు గల సీసీ (సిమెంట్ కాంక్రీట్) రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. గ్రామస్తుల చిరకాల వాంఛ అయిన ఈ రహదారి నిర్మాణంతో వర్షాకాలంలో ఎదురయ్యే బురద కష్టాల నుంచి విముక్తి లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతతో కూడిన పనులు జరిగేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెన్నూరి రాంరెడ్డి, ఉప్పసర్పంచ్ దశరథ్,వార్డ్ నెంబర్ చిన్న పీరుగొండ, స్థానిక నాయకులు మరియు సిద్దప్ప,గంగారాం,సాయిలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక వెలుగులో కల్లూరు గ్రామం

**ధర్మ రక్షణే ధ్యేయంగా బాలయోగి కృష్ణ మహారాజ్ దివ్య ప్రవచనం**



**వాస్తవ నేస్తం,కోటగిరి(పోతంగల్) :** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తహ మహోత్సవాలు ఆరవ రోజుకుచేరుకున్నాయి. ఈ సందర్భంగా మల్లారం పీఠాధిపతి బాలయోగి కృష్ణ మహారాజ్ తన దివ్య ప్రవచనాలతో భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపారు. సప్తహంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ విశేష కార్యక్రమంలో ఆయన బ్రహ్మ విద్యాయ యోగ శక్తి గురించి, హిందూ ధర్మం మరియు ఆచార వ్యవహారాల ప్రాముఖ్యతను అద్భుతంగా వివరించారు.ప్రవచనంలో భాగంగా మహారాజ్ గారు మాట్లాడుతూ.. బ్రహ్మ విద్య అనేది కేవలం జ్ఞానం మాత్రమే కాదని, అది మన అంతరాత్మను పరమాత్మతో అనుసంధానించే అత్యున్నత యోగ శక్తి అని పేర్కొన్నారు. మానవ జన్మ సార్థకత కావాలంటే ఆధ్యాత్మిక చింతనతో పాటు యోగ సాధన అవసరమని సూచించారు. మన పూర్వీకులు అందించిన ప్రతి సంప్రదాయం వెనుక ఒక శాస్త్రీయ కోణం, సామాజిక హితం దాగి ఉందని, హిందూ బంధువులందరూ తమ దైనందిన జీవితంలో ధర్మాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా క్రమశిక్షణ, సత్ప్రవర్తన మరియు భక్తి మార్గం ద్వారానే ప్రశాంతమైన జీవితం ఉంటుందన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com